# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ‘సంజీవని’ ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- సముద్రంలో వేటకు వెళ్లిన కోనసీమ మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.

- రాష్ట్రంలోని 21 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు.

- శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

=====================

వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన ‘సంజీవని ప్రాజెక్టు’ను జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఈరోజు ‘సంజీవని ప్రాజెక్ట్’పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఆంధ్రప్రదేశ్ ను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ‘సంజీవని ప్రాజెక్టు`ను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యా, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సివస్తోందని.. ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య

రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

======================

సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన కోనసీమకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు నుంచి సముద్ర వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటులో సాంకేతిక సమస్య తలెత్తడంతో పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకున్నారని వెల్లడించారు. బోటు యజమాని సోదరుడుతో అధికారులు మాట్లాడి వివరాలు నిర్ధారించారన్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేసిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జేడీ, ఎఫ్‌డీవోలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని తెలియడంతో కుటుంబాల్లో ఊరట లభించింది. వారిని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామ మంత్రి చెప్పారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు.

======================

రాష్ట్రంలో 21 లక్షల మంది యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. స్వర్ణ, గ్రామం, స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన `కౌశలం జాబ్ మేళా` కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 800 మంది నిరుద్యోగ యువతతో పాటు, గ్రీన్ టెక్ సహా పలు సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని నిరుద్యోగ యవతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ కౌశలం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా ఇప్పటివరకు 10 వేల మందికి పైగా ఉపాధి కల్పించబడిందని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 8 ప్రాంతాల్లో స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, ఇజ్రాయిల్ భాషలలో  శిక్షణ ఇచ్చి.. ఆ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

అమరావతి శాసనసభ భవనాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శాసనసభ భవన నిర్మాణానికి సంబంధించి అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సమావేశంలో పలు అంశాలపై సమగ్రంగా చర్చించామని తెలిపారు. శాసనసభ భవనంపైన ప్రత్యేక టవర్‌ను ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి అమరావతి రాజధాని మొత్తాన్ని వీక్షించేలా నిర్మాణ రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 265 శాసనసభ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా శాసనసభ భవనాన్ని డిజైన్ చేస్తున్నామని మంత్రి వివరించారు. అత్యాధునిక సాంకేతికత, సమర్థవంతమైన కార్యనిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించనున్నామని నాదెండ్ల మనోహర్ వివరించారు.

విరామం

======================

సేవా మూర్తి మదర్ థెరిసా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఈరోజు విజయనగరం క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళి  అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

దేశం గాని దేశం వచ్చి కలకత్తా వంటి మహానగరంలో కష్టంలో ఉన్న అభాగ్యులకు అనేక రకాల సేవలు అందజేసిన మాతృమూర్తి మదర్ థెరిసా అన్నారు. కలకత్తాలో మిషన్ ఆఫ్ చారిటీని స్థాపించి నిస్సహాయులు, అనాధలతో పాటు, కుష్టు రోగులకు సైతం సేవలు అందజేసిన గొప్ప మనసున్న మంచి మనిషి, సేవకురాలు అని కొనియాడారు. మదర్ థెరిసా నిస్వార్థ సేవలు ప్రతి ఒక్కరికీ స్పూర్తి దాయకమని మంత్రి పేర్కొన్నారు.

=====================

పవిత్ర మిలాద్-ఉన్-నబీ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈరోజు ఘనంగా జరుపుకున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని గోపాలపట్నం తాహ్ మసీదు ఆధ్వర్యంలో ముస్లింలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు  పి. గణబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన `మిలాద్-ఉన్-నబీ` సర్వమానవాళికి ఎంతో పవిత్రమైన రోజని కొనియాడారు. ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, సమభావం, సోదరభావం ప్రపంచానికి ఆదర్శమని, ఆయన చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు.
సమాజంలో హింసను రూపుమాపి, ప్రతి వ్యక్తిని ప్రేమించాలని మహ్మాద్ ప్రవక్త బోధించారని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. ప్రవక్త మహ్మాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్వతీపురంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.
శ్రీకాకుళంలో జామియా మసీదు ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో శాసనసభ్యులు గొండు శంకర్ పాల్గొని ప్రసంగించారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన జాలి, కరుణ, ప్రేమ, దయ వంటి సద్గుణాలు సమాజంలో శాంతి స్థాపనకు అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.

=====================

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం ద్వారా నంద్యాల జిల్లా రైతులు ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో లక్షా 81 వేల 968 మంది రైతులు పీఎం కిసాన్ లబ్ధిదారులుగా ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పెట్టుబడి విషయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. 2026 సంవత్సరానికి సంబంధించి పీఎం కిసాన్ తొలి విడతగా జులై నెలలో జిల్లాలోని రైతులకు 36 కోట్ల 26 లక్షల రూపాయల ఆర్థిక ప్రయోజనం అందించామని వ్యవసాయ అధికారులు తెలియజేశారు. విత్తనాల కొనుగోలు, సస్యరక్షణ చర్యలు, పంటల యాజమాన్యం వంటి వ్యవసాయ అవసరాలకు ఈ మొత్తాన్ని రైతులు వినియోగించుకోవచ్చని నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టి. మోహన్ రావు వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================
=====================